క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని అచ్యుతాపురం ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కల గనుందని విద్యుత్‌శాఖ అధికారి పి.హరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో గుజ్జింగివలస, గోషాడ, తెట్టంగి, పోలాయవలస, చుక్కపేట, చోడవరం, పెనుబర్తి, చింతపల్లిపేట, గంగిరెడ్లపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ ట్రస్టు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత వెంకటరమణ

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు నుంచి సహకారం లభిస్తోంది. పట్టణంలోని కస్పావీధికి చెందిన అంధవర పు వెంకటరమణ, నాగరత్నం దంపతులు రూ.1,11,111 నగదును ఆలయ ట్రస్టు సభ్యులకు గురువారం అందజేశారు. ట్రస్టు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, ఒమ్మి రమేష్, గుడ్ల శ్రీనివాసరావు, దాసరి రవి మాట్లాడుతూ దాతల సహకారంతోనే అయ్యప్ప ఆలయ నిర్మాణం జరుగుతోందన్నారు. దాదాపు రూ.2 కోట్లకు పైగా అంచనా వ్యయంతో ఆలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చీపురుపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.శ్వేత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల కు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్స మ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

కొత్తవలసలో..

కొత్తవలస: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణయ్య గురువారం ఓ ప్రకటన లో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

పాఠశాలల సందర్శన



దొగ్గపేట పాఠశాలలో విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ-2 బాల భాస్కరరావు

వేపాడ: మండలంలోని దొగ్గపేట, పైలకొంపలు గ్రామ ప్రాథమిక పాఠశాలలు,వేపాడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యాన్ని(కేజీబీవీ) ఎంఈఓ-2 బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. ప్రాథమిక పాఠశాలల్లో కిచెన్ గార్డెన్‌లను, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. కేజీబీవీలో వంట సరుకులను పరిశీలించారు. ఆయన వెంట ఆయా పాఠశాల హెచ్ఎంలు, కేజీబీవీ ఎస్ఓ కిరణ్మయి ఉన్నారు.

ఘనంగా రెవెన్యూ డే



రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన తహసీల్దార్ చంద్రశేఖరరావు

కొత్తవలస: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డే వేడుకలను తహసీల్దార్ సి.చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వీఆర్ఓలు, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ భారతదేశంలో రెవెన్యూ వ్యవస్థ 1886లో వచ్చిందని, ప్రభుత్వం జూన్ 20న రెవెన్యూ డేగా ప్రకటిం చిదని తెలిపారు. ప్రజలకు రెవెన్యూ శాఖకు సంబంధించిన సేవలను సంతృప్తికర స్థాయిలో అందించాలని సిబ్బందికి సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ టి.రమేష్, ఆర్ఐ సీహెచ్.రాజేష్ పాల్గొన్నారు.

హోంగార్డుకు చేయూత

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా ఎంపికై విశాఖ స్టీల్ ప్లాంట్‌లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కె.భరికకు చేయూతగా హోంగార్డ్స్ అందించిన ఒక్కరోజు అలవెన్స్ రూ.3 లక్షల 25వేల 890 చెక్కును ఎస్పీ ఎం.దీపిక తన చాంబర్‌లో గురువారం అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ ఆర్ఐ రమేష్‌కుమార్, కార్యాలయ పర్యవేక్షకులు ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

దత్తిరాజేరు:

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలోని పెదమానాపురం రైతుభరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయం పరిధిలో రైతులందరికీ పూర్తిస్థాయిలో విత్తనాలు అందించాలని వీఏఏ గణపతి సూచించారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గుర్ల మండలంలో..

గుర్ల: జమ్ము, చింతపల్లిపేట గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల వద్ద రైతులకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు గొర్లె నరసింహమూర్తి, జమ్ము శ్రీదేవి గురువారం రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. రైతులందరికీ విత్తనాలు అందేలా వ్యవసాయ అధికారులు చొరవ చూపాలని సూచించారు. వీఏఏలు, జమ్ముపేట సర్పంచ్ కురుమునెల్లి వరలక్ష్మి, స్థానిక నాయకులు జమ్ము అప్పలనాయుడు, మండల అప్పల నాయుడు పాల్గొన్నారు.



దత్తిరాజేరు: పెదమానాపురంలో రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రాజేశ్వరి, తదితరులు

గొల్లుపాలెంలో..

బొండపల్లి: గొల్లుపాలెం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు సర్పంచ్ పోతల రమణమ్మ ఆధ్వర్యంలో గురువారం రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏతో పాటు నాయకులు పోతల కన్నం నాయుడు,తదితరులు పాల్గొన్నారు.



బొండపల్లి: గొల్లుపాలెంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు



గుర్ల: చింతపల్లిపేటలో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీదేవి, తదితరులు



గుర్ల: జమ్ములో విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నరసింహమూర్తి

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఎస్‌డీఎస్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు


కొత్తవలస: నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని, మానసిక ఆరోగ్యానికి యోగా సాధన దోహదపడుతుందని సీఐ వి.చంద్రశేఖర్, గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళపాలెం గ్రామంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో దివ్యాంగుల కోసం గురువారం యోగా శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ గురుదేవా ట్రస్టు లక్షలాది మంది దివ్యాంగులకు సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. దివ్యాంగుల సేవకే ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు తన జీవితాన్ని అంకితం చేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. జగదీష్‌బాబు మాట్లాడుతూ అవయవాలు లేనివారు దివ్యాంగులు కాదని, మంచి చేయలేని వారే నిజమైన దివ్యాంగులన్నారు. ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంత రం యోగా శిక్షకులు ప్రసాద్‌రావు దివ్యాంగులకు యోగా ఆసనాలపై అవగాహ న కల్పించారు. వివిధ జిల్లాల నుంచి సుమారు 500లకు పైగా దివ్యాంగులు హాజరయ్యారు. వీరందరికీ టీషర్టులు, టోపీలు అందజేశారు. ట్రస్టు వైస్ చైర్మన్ డాక్టర్ ఫణీంద్ర, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

యోగా దినచర్యగా మార్చుకోవాలి

చీపురుపల్లిరూరల్(గరివిడి): ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడం దినచర్యగా మార్చుకోవాలని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని చీపురుపల్లి,గరివిడి వాకర్ క్లబ్ మెంబర్స్ ఆధ్వర్యంలో గరివిడి ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం యోగ ఆసనాలు వేశారు. రోజూ నడకతో పాటు యోగా చేయడం వల్ల శారీరక ,మానసిక ఆరోగ్యం బాగుంటుందని వాకర్ క్లబ్ మెంబర్లు ప్రమీలకుమార్, పి.వి.రామయ్య, వెంకటరావు, రాజు, భాస్కరరాజు,సంతు తెలిపారు.



కొత్తవలస: గురుదేవా చారిటబుల్ ట్రస్టులో యోగా శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ చంద్రశేఖర్



కొత్తవలస: గురుదేవా చారిటబుల్ ట్రస్టులో దివ్యాంగులకు ఆసనాలపై అవగాహన కల్పిస్తున్న యోగా గురువు ప్రసాదరావు

విసిగిస్తున్న విద్యుత్ కోతలు

బొండపల్లి: మండలంలో వారం రోజులుగా అన్ని గ్రామాల్లో విధిస్తున్న అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన ఎండలు, ఉక్కపోతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫ్యాన్ల కింద సేదతీరుదామని అనుకుంటే ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండ డంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. గాలులు, వర్షం లేకపోయినా పగలు, రాత్రి తేడా లేకుండా ఎందుకు విద్యుత్ కోతలు విధిస్తున్నారో తెలియడం లేదని వాపోతున్నారు. గత నాలుగు రోజులుగా మండల వ్యాప్తంగా అధికారిక ప్రకటన లేకుండా అధికారులు విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు.

బడిబయట పిల్లల గుర్తింపు సర్వే



ముసిరాంలో ఇంటింట సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్ అర్జునరావు, తదితరులు

కొత్తవలస: ముసిరాం గ్రామంలోని ఎస్సీ కాలనీలో బడిబయట పిల్లల గుర్తింపు సర్వేను ఎన్యూ మరేటర్ వై.అర్జునరావు ఆధ్వ ర్యంలో గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి 6 నుంచి 14 సంవత్సరాల లోపు పిల్లలు వివరాలను తెలుసుకుని, వారు పాఠశాలలకు వెళ్తున్నదీ లేనిది ఆరా తీశా రు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించారు. ఎవరైనా బడి ఈడు పిల్లలు మధ్యలో చదువు మానేసిన వారు ఉంటే వెంటనే పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. హెచ్ఎం ఎస్.ప్రసాద్,సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సహాయకురాలు టి.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం



ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయ సిబ్బంది

దత్తిరాజేరు: ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనదని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకుందామని ఎంఈఓ ఎం.వెంకటరావు అన్నారు. 'సేవ్ వాటర్'కార్యక్రమంలో భాగంగా స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినులతో కలిసి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మానవునితో పాటు సకల జీవరాశుల మనుగడకు నీరే ప్రాణాధారమని అన్నారు. భవిష్యత్ తరాల కోసం నీటిని పొదుపు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

చీపురుపల్లిరూరల్(గరివిడి): రోజు రోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ, అవగాహన కలిగి ఉండాలని లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్ మేనేజర్ ప్రత్యూష అన్నారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా సూచనలతో గరివిడిలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకింగ్ సేవలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలు, ఖాతాల నిర్వహణ గురించి తెలుసుకోవాలని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసి బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్ వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. ఫేక్ మెసేజ్‌లు, మెయిల్స్‌కు స్పందించవద్దని చెప్పారు.ఎలాంటి సందేహాలున్నా నేరుగా బ్యాంకులకు వెళ్లి నివృత్తి చేసుకోవాలని తెలిపారు.డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రి, డీపీఎం ఎల్.హెచ్. రాజ్‌కుమార్, గరివిడి వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ బంగారమ్మ, ఏపీఎం పద్మ, రిసోర్స్ పర్సన్ ఫణికుమార్, ట్రైనర్లు సూరిబాబు,సాయిబాబా పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్ మేనేజర్ ప్రత్యూష

ఉత్తమ సేవలకు ప్రశంసలు

మెరకముడిదాం: సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతంగా విధులను నిర్వర్తించినందుకు బుధరాయవలస ఎస్ఐ బి.లోకేశ్వరరావును జిల్లా ఎస్పీ ఎం.దీపిక అభినందిస్తూ ప్రశంసాపత్రం అందజేశారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించిన జిల్లాలోని పలువురు పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మాసాంతర నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ అభినందించారు. మెరకముడిదాం మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా చర్యలు చేపట్టినందుకు తనకు ఎస్పీ అవార్డు అందజేశారని ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు. ఆయన్ని బుధరాయవలస పోలీస్ స్టేషన్ సిబ్బంది గురువారం అభినందించారు.



ఎస్పీ ఎం.దీపిక చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ లోకేశ్వరరావు

వర్షపునీటిని ఒడిసి పడదాం

మెరకముడిదాం: వర్షపు నీరు ఒడిసి పట్టి భూగర్భంలోకి ఇంకే విధంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా జీడి, మామిడి తోటల్లో గట్లు పనులు చేయాలని ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్ వేతనదారులకు సూచించారు. గాదెల మర్రివలస గ్రామంలోని రైతు టి.అప్పారావుకు చెందిన ఎకరా మామిడితోటలో ఉపాధి పథకంలో భాగంగా వేస్తున్న గట్లును గురువారం ఆయన పరిశీలించారు. గట్లు వేసేందుకు తవ్విన గుంతలను కొలిచారు. వేతనదారులతో ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేయాలని, గట్లు కోసం తీసిన గుంతల్లో వర్షపునీరు నిల్వ ఉండే విధంగా వాటిని తవ్వాలన్నారు. ఉపాధి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



గట్లు కోసం తవ్విన గుంతలకు కొలతలు వేయిస్తున్న ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్

• వేంకటేశ్వరస్వామికి తులాభారం సేవ



భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేదపండితుల ఆధ్వర్యంలో స్వామి వారి తులాభారం సేవను బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పటిక బెల్లంతో భక్తులు స్వామివారికి తులాభారం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. - జామి

• గో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి



గోవుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులతో పాటు, పోలీసులు చర్యలు తీసుకోవాలని, అక్రమరవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ గోసంరక్షణ సమా ఖ్య రాష్ట్ర అధ్యక్షు డు లోగిశ రామ కృష్ణ డిమాండ్ చేశారు. బొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద గోసంరక్షణ సమాఖ్య సభ్యులు గురువారం నిరసన తెలిపారు. అనంతరం కార్యాల యాల ప్రాంగణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గజపతినగరం నియోజకవర్గంలోని మానాపురంలో ప్రతీ శనివారం పశువుల సంత నిర్వహిస్తుంటారని, ఈ సంతకు మన రాష్ట్రంతో పాటు ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి పశువులను విక్రయించేందుకు తీసుకువ స్తుంటారని, మళ్లీ వీటిని అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించడం జరుగు తోందన్నారు. సంబంధిత అధికారులతో పాటు,పోలీసులు జోక్యం చేసుకొని గోవుల అక్రమరవాణాను అరికట్టాల్సిన బాధ్యత ఉందన్నారు. అధికారులు స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వి.ఆర్.సూర్యనారాయణ, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చోళ్ల రాజకుమారి, గోసంరక్షణ సమాఖ్య విజయనగరం పట్టణ అధ్యక్షుడు మద్దిల సోంబాబు, కార్యదర్శి రెడ్డి రవిశంక ర్, సభ్యులు నీలాపు దేవి,యు.పైడితల్లి పాల్గొ న్నారు. - బొండపల్లి

• అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ



అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని గజపతినగరం అగ్నిమాపక శాఖ అధికారి ఎం.ఎస్.వి.రవిప్రసాద్ అన్నారు. అగ్నిప్రమాదాల నివారణపై గజపతినగరం మండల కేంద్రంలో అగ్నిమాపక శాఖ సిబ్బందితో కలిసి ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ లీకుల వల్ల వచ్చే మంటలను అదుపుచేసే విధానాన్ని మహిళలకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈసందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి మాట్లాడుతూ ఇళ్లలో మహిళలు గ్యాస్ స్టౌవ్‌పై వంట చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వంట పూర్తయ్యాక సిలిండర్ రెగ్యులేటర్‌ను కట్టేయాలని, కిటికీలు తెరచి ఉంచాలన్నారు. గ్యాస్ లీకేజ్ వల్ల మంటలు వచ్చినప్పుడు భయాందోళన చెందకుండా దుప్పటి లేదా గోనె సంచులను నీటిలో తడిపి సిలిండర్‌కు చుడితే మంటలు అదుపులోకి వస్తాయని చెప్పారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల వచ్చే మంటలను అదుపు చేసే విధానాన్ని వివరించారు.

- గజపతినగరం

మెరుగైన వైద్యసేవలందించండి

గంట్యాడ: గ్రామ స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్) ప్రతినిధులు డాక్టర్ జోసఫ్, డాక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. మండలంలోని కొర్లాం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను వారు గురువారం పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్‌లో రోగులకు అందిస్తున్న సేవలు గురించి ఆరా తీశారు. ఏఏ వ్యాధులతో ఎక్కువగా రోగులు వస్తున్నారు, వారికి అందిస్తున్న చికిత్స, మందులు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ కె.ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.



కొర్లాం వెల్‌నెస్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ జోసఫ్, డాక్టర్ అశోక్‌కుమార్